బుధవారం 05, జూన్ 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL


https://epaper.eyyaltynews.com/

# ఏపీలో టీడీపీ విజయంపై అంబర్ పేటలో సంబరాలు

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట,జూన్ 4: ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా అంబర్ పేటలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఓ .వెంకటేశ్ చౌదిరి ఆధ్వర్యంలో పటేల్ నగర్ లో పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు.








కౌంటింగ్ ట్రెండ్ దెబ్బ.. స్టాక్ మార్కెట్లు ధమాల్..

3లో




ఏం జరిగిందో తెలుస్తలేదు..... కానీ...!: సీఎం జగన్..

2లో



బీఆర్ఎస్ కు దెబ్బమీద దెబ్బ.. ఇప్పటి వరకు ఉన్న కంటోన్మెంట్ కూడా కాంగ్రెస్ కైవసం ..

2లో



వారణాసిలో ప్రధాని మోదీ హ్యాట్రిక్- మెజార్టీ ఎంతంటే?..... ..

3లో

# లష్కర్‌పై మరోసారి జెండా పాతిన కిషన్ రెడ్డి


- 41 వేల ఓట్ల మెజార్టీతో ఆదుకున్న అంబర్ పేట
- గట్టి పోటీ ఇచ్చిన దానం..!.. మూడో స్థానానికి పరిమితమైన పజ్జన్న




**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 4**: సికింద్రాబాద్ లోక్ సభ స్థానం నుంచి 2019 ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి.. ఈ సారి కూడా బరిలో దిగి వరుసగా రెండోసారి విజయం సాధించి లష్కర్ పై జెండా పాతారు. అయితే.. ఈ పోటీలో కాంగ్రెస్ పార్టీ నుంచి దానం నాగేందర్, బీఆర్ఎస్ పార్టీ నుంచి తీగుళ్ల పద్మారావు గౌడ్ బరిలో నిలవగా.. ముగ్గురి మధ్య హోరాహోరీ పోటీ నడిచింది. ప్రధానంగా.. బీజేపీకి, కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ జరగ్గా.. చివరికి 49944 ఓట్ల మెజార్టీతో కిషన్ రెడ్డి గెలుపొందారు. అయితే అందులో అంబర్ పేట నియోజకవర్గం 41వేల 655 ఓట్ల లో కిషన్ రెడ్డిని ఆదుకోకా.. కిషన్ రెడ్డికి మొత్తంగా 473012 ఓట్లు పోలవగా.. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు 423068 ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కి 129586 ఓట్లు పోలయ్యాయి. చివరివరకు కిషన్ రెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గట్టి పోటీనిచ్చారు. చివరికి 49 వేల మెజార్టీతో వరుసగా రెండో సారి కూడా కిషన్ రెడ్డి సికింద్రాబాద్ ఎంపీగా విజయం సాధించారు.

సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో ముషీరాబాద్, అంబర్ పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, నాంపల్లి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మల్కాజిగిరి, హైదరాబాద్ లోక్ సభ స్థానాల మాదిరిగా ఇది కూడా పూర్తిగా పట్టణ జనాభాతో కూడిన నియోజకవర్గం. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాన్ని అత్యధిక సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుచుకోగా.. తెలంగాణలో బీజేపీ ఎక్కువసార్లు గెలిచిన సీటు కూడా ఇదే కావటం గమనార్హం. సికింద్రాబాద్ లోక్ సభ స్థానం నుంచి బీజేపీ నేత బండారు దత్తాత్రేయ నాలుగు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 2019లో కిషన్ రెడ్డి బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించారు. కేంద్రంలో నరేంద్రో మోదీ కేబినెట్లో మంత్రి పదవి దక్కించుకున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయన బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగానూ బాధ్యతలు చేపట్టారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లోనూ కిషన్ రెడ్డి బీజేపీ అభ్యర్థిగా మరోసారి బరిలో నిలిచారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ ప్రస్తుతం సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతుండగా.. దానం నాగేందర్ ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యూహాత్మకంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలను బరిలోకి దింపాయి. మూడు పార్టీల అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. గెలుపుపై ఎవరికి వారు విశ్వాసం వ్యక్తం చేశారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. నాంపల్లి స్థానంలో మాత్రం ఎంఐఎం అభ్యర్థి గెలుపొందారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ 46.49 శాతం పోలింగ్ నమోదు కాగా.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 50.55 శాతం పోలింగ్ నమోదైంది. మే 13న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానంలో 49.04 శాతం ఓటింగ్ నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే సికింద్రాబాద్‌లో ఓటింగ్ శాతం స్వల్పంగా పెరిగింది.

# ఇంతకీ కమలం పువ్వు వికసించిందా? .. వికటించిందా..?



**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూన్ 4:** సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా బీజేపీ 370 సీట్లు సాధిస్తామని చెప్పిన ఆ పార్టీకి ఇప్పుడు చుక్కెదురైంది. గతం కంటే కనీసం 60కిపైగా సీట్లు తక్కువ వచ్చాయి. ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ (80), పశ్చిమ బెంగాల్ (42) మహారాష్ట్ర (48), కర్ణాటక (28), బిహార్ (39), రాజస్థాన్ (25) రాష్ట్రాల్లో గతం కంటే సీట్లు కోల్పోయాయి. ఒడిశాలో చిన.. తమిళనాడులో రాణి అంచనాలు పూర్తిగా తలకిందులయ్యాయి. ఫలితంగా భాజపా సొంతంగా మెజార్టీ సాధించలేని పరిస్థితి. ఈమెరకు ఇండియా కూటమిలో కాంగ్రెస్‌కు 99, సమాజ్‌వాదీ పార్టీకి 36 సీట్లతో భారీగా లబ్ధి చేకూరింది.

**కూటమిలో అతిపెద్ద నష్టం బీజేపీకే.**

కమలం పార్టీ ఈసారి 441 సీట్లలో తమ అభ్యర్థులను నిలబెట్టింది. ఎన్డీఏ మిత్రపక్షాలు మొత్తం 540 సీట్లలో పోటీ చేశాయి. ఈ కూటమిలో అత్యధికంగా బీజేపీనే 2019తో పోలిస్తే 20శాతానికి పైగా సీట్లను కోల్పోయింది. గత ఎన్నికల్లో 303 సీట్లను సాధించిన కమలం పార్టీ ఈసారి సొంత మెజార్టీకి దిగువనే సర్దుకోవాల్సి వచ్చింది. కూటమిలోకి తిరిగి పునరాగమనం చేసిన తెదేపా గతంతో అదనంగా 12 సీట్లు లబ్ధి పొందింది.

**హిందీ బెల్ట్‌లో గతి తప్పి..**

దేశ వ్యాప్తంగా అత్యధిక సీట్లున్న పెద్ద రాష్ట్రాల్లో భాజపాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మినహా, యూపీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో తీవ్రంగా దెబ్బతింది. ఇది మొత్తంగా భాజపా సీట్ల సంఖ్యపై ప్రతికూల ప్రభావం చూపింది. యూపీలో 2019లో 64 సీట్లను గెలుచుకోగా.. ఈసారి దాదాపు 30 స్థానాలు కోల్పోయింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో భాజపా విజయం సాధించిన రాజస్థాన్‌లో పార్లమెంట్‌కు వచ్చేసరికి దాదాపు భారీగా సిట్టింగ్ సీట్లు కోల్పోయింది. 2019లో ఇక్కడ క్లీన్ స్వీప్ చేసిన కమలదళం ఈసారి 14కు పరిమితమైంది. ఇక రాష్ట్రమైన బిహార్ గత ఎన్నికల్లో ఎన్డీఏ సాధించిన39 సీట్లలో ఒంటరిగా17 భాజపానే పెద్దది. కానీ, ఈసారి కమలం పార్టీకి 5 తగ్గి 12 సీట్లకు పడిపోగా.. మిత్రపక్షమైన జేడీఎస్ (ఎస్)కు కూడా రెండు స్థానాల్లో నష్టం చేకూరింది. మొత్తం మీద ఇక్కడ 30 స్థానాలు ఉన్నాయి.

**దీదీ అడ్డాలో కూడా ఎదురుదెబ్బే..**

బీజేపీ ఈసారి సీట్ల పుంజుకొంటుందని భావించిన పశ్చిమబెంగాల్‌లో కూడా కమలం పార్టీ కనీసం 6 స్థానాలు కోల్పోయింది. గతంలో 18 చోట్ల గెలవగా.. ఈసారి 12కి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో కాంగ్రెస్ కూడా ఒక సీటు కోల్పోయింది. ఇవి మొత్తం తృణమూల్ కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. ఇక... బీజేపీకి దక్షిణాదిన బలమైన పట్టున్న రాష్ట్రం కర్ణాటక. ఇక్కడ మొత్తం 28 సీట్లుండగా.. గతంలో ఎన్డీఏ 26 గెలుచుకుంది. ఇటీవల జేడీఎస్ కూడా చేరడంతో ఆ బలం 27కు పెరిగింది. కానీ, 2024 ఎన్నికల ఫలితాల్లో మాత్రం భాజపా మిత్రపక్షాల బలం 19కే పరిమితమైంది. మిత్రపక్షమైన జేడీఎస్ గతంలో కంటే ఒక సీటు అదనంగా గెలుచుకోవడమే ఇక్కడ ఊరట.

**మహారాష్ట్రలో ముడుచుకున్న కమలం..**

మహారాష్ట్రలో కూడా గత ఎన్నికల తాజా ఎన్డీఏ తీవ్రంగా దెబ్బతింది. 2019లో అక్కడ 41 సీట్లలో కూటమి విజయం సాధించింది. వీటిలో భాజపాకు 23.. శివసేనకు 18 స్థానాలు వచ్చాయి. కానీ, ఈసారి చీలిన పార్టీలతో కూటమి కట్టి.. 18 వద్దే ఆగిపోయింది. ఇక 2019 ఎన్నికల్లో హరియాణాలో 10 స్థానాల్లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేయగా.. ఈసారి మాత్రం బలం 5కు పడిపోయింది. ఇక్కడ హస్తం భారీగా పుంజుకుంది.

# దెబ్బ మీద దెబ్బ.. పార్లమెంటులో ప్రాతినిధ్యం కోల్పోయిన బీఆర్ఎస్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** ఓడలు బండ్లవుతాయి.. బండ్లు ఓడలవుతాయనే సామెత సమకాలీన రాజకీయాల్లో భారత రాష్ట్ర సమితికి సరిగ్గా సరిపోతుందని చెప్పాలి. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత తొలి పార్లమెంట్ ఎన్నికలకు కేసీఆర్ కుటుంబం దూరంగా ఉండటం బీఆర్ఎస్‌ను ఊహించని దెబ్బ కొట్టింది. లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకుండా పోవడం మరో దెబ్బ. 2014 నుంచి 2023 నవంబర్ వరకు దాదాపు పదేళ్లు తెలంగాణ అధికార పార్టీగా చక్రం తిప్పిన బీఆర్ఎస్‌కు మొన్నటి అసెంబ్లీ ఎన్నికలు చేదు ఫలితాన్ని అందించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరూ పార్టీని వీడటం బీఆర్ఎస్‌ను మరింత దెబ్బకొట్టింది. ఇప్పుడు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖాతా తెరవలేకపోవడం ఊహించని పరిణామమే. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత బీఆర్ఎస్‌కు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి కేసీఆర్ కుటుంబం నుంచి ఎవరూ లోక్‌సభ బరిలో నిలబడలేదు. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత 2004లో జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కేసీఆర్ ఎంపీగా గెలిచారు. అప్పటి యూపీఏ సర్కారులో ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2006, 2008లో జరిగిన కరీంనగర్ పార్లమెంట్ ఉపఎన్నికలో ఆయన విజయం సాధించారు. 2009లో ఆయన మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధించడంతో కేసీఆర్ సీఎం అయ్యారు. ఆ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి కేసీఆర్ కుమార్తె కవిత ఎంపీగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఆమె బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఆమె పోటీ చేయలేదు. అలాగే కేసీఆర్ కుటుంబం నుంచి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయలేదు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో పోలైన ఓట్లలో బీఆర్ఎస్ కేవలం 16.69 శాతం ఓట్లు మాత్రమే రాబట్టగలిగింది. సంఖ్యాపరంగా ఇది పెద్దగానే కనిపిస్తున్నా అవి సీట్ల రూపంలోకి మారలేదు. ఓట్లపరంగా చూస్తే ఇది కేవలం 36 లక్షల 19 వేల 626 మాత్రమే.

# బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల గొంతుక..

## ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉంటాం : కేటీఆర్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** లోక్ సభ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలు నిరాశపరిచాయని చెప్పారు. మళ్లీ త్వరలోనే బీఆర్ఎస్ పుంజుకుంటుదన్న నమ్మకం వ్యక్తం చేశారు. పార్టీ స్థాపించిన 24 ఏళ్ల సుదీర్ఘమైన ప్రస్థానంలో ఎన్నో రకాల ఎత్తుపల్లాలను చూశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అద్భుతమైన విజయాలతో పాటు అనేక ఎదురు దెబ్బలు ఎదుర్కొన్న అనుభవం పార్టీకి ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీగా తమకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి మించిన గౌరవం, విజయం మరేది లేదని గుర్తు చేశారు. గతంలోనూ ఇలాంటి ఎదురుదెబ్బలు తిన్నప్పటికీ ప్రజాదరణతో బీఆర్ఎస్ పుంజుకున్న సందర్భాలెన్నో ఉన్నాయన్నారు. తెలంగాణ సాధించటంతో పాటు ఒక ప్రాంతీయ పార్టీగా రెండుసార్లు అద్భుతమైన మెజార్టీ 2014 లో 63 సీట్లు, 2018 లో 88 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రస్తుత శాసనసభలోనూ మూడో వంతు సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ కొనసాగుతుందన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ స్వల్ప తేడాతోనే ఓటమి పాలైందని గుర్తు చేశారు

# కాంగ్రెస్, బీజేపీలకు చెరో 8 సీట్లు..


## 'ఎంఐఎం'దే హైదరాబాద్.. పాపం.. ఖాతా తెరవని బీఆర్ఎస్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు తగ్గట్లుగానే కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీగా దూసుకెళ్లాయి. హస్తం, కమలం చెరో 8 స్థానాలు గెలుచుకున్నాయి. ఎప్పటిలాగే హైదరాబాద్ సీటును ఎంఐఎం దక్కించుకుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్?ఎస్? ఎన్నికల్లో ప్రభావం చూపలేకపోయింది. బీఆర్?ఎస్ ఆవిర్భావం తరువాత తొలిసారి ఆ పార్టీ ఖాతా తెరవలేకపోయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. డబుల్ డిజిట్‌పై కన్నేసిన రెండు పార్టీలు హోరాహోరీగా పోరాడినా ఓటర్లు మాత్రం ఎవరికీ పూర్తిస్థాయిలో పట్టం కట్టలేదు. 17 స్థానాలకు గాను కాంగ్రెస్, బీజేపీ చెరో 8 స్థానాల్లో విజయం సాధించగా ఎంఐఎం హైదరాబాద్?ను నిలబెట్టుకుంది. ఖమ్మం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు రామసహాయం రఘురామిరెడ్డి 4 లక్షల 62 వేల ఓట్ల తేడాతో సమీప ప్రత్యర్థి, బీఆర్?ఎస్? సిట్టింగ్ ఎంపీ నామ నాగేశ్వరరావును ఓడించారు. అక్కడి నుంచి బీజేపీ తరఫున బరిలో తాండ్ర వినోద్‌రావు మూడోస్థానానికే పరిమితమయ్యారు. నల్గొండలో కాంగ్రెస్ అభ్యర్థి కుందురు రఘువీర్‌రెడ్డి విజయదుందుభి మోగించారు. సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన సైదిరెడ్డిపై 5 లక్షల 51 వేల పైచిలుకు ఓట్ల తేడాతో గెలుపొందారు. తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధిక మెజారిటీ ఓట్ల పరంగా రఘువీర్ రెడ్డి విజయం సాధించారు. 2011లో కడప లోక్‌సభ ఉపఎన్నికలో ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి 5 లక్షల 43 వేల మెజార్టీతో గెలవగా అంతకు మించిన మెజార్టీ కంటే ఎక్కువ సాధించి అరుదైన రికార్డు తన పేరిట లిఖించుకున్నారు. వరంగల్‌లో కాంగ్రెస్? అభ్యర్థి కడియం కావ్య రెండు లక్షల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. బీజేపీకి చెందిన ఆరూరి రమేశ్?, బీఆర్?ఎస్? అభ్యర్థి సుధీర్?కుమార్ రెండు, మూడు స్థానాలకే పరిమితమయ్యారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ బీఆర్?ఎస్? అభ్యర్థి కవితపై 3 లక్షల 24 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఘనవిజయం సాధించారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్? అభ్యర్థి సురేశ్ షెట్కార్ 45 వేల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. భువనగిరిలో హస్తం పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి లక్షా 95 వేల ఓట్ల పైచిలుకు తేడాతో గెలుపొందారు. నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్? అభ్యర్థి మల్లు రవి 88 వేలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. పెద్దపల్లిలో గడ్డం వంశీకృష్ణ లక్షా 31 వేల ఓట్ల మెజార్టీ సాధించారు. జహీరాబాద్‌లో సురేశ్ షెట్కార్ 45 వేల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు.

మిగతా.. 2లో

# ఆ ..ఒక్కరు తప్ప.. కారు దిగి ఇతర పార్టీల్లోకి వెళ్ళినోళ్లంతా ఓడి పోయిండ్రు...



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లి పోటీ చేసిన నేతలు ఓడిపోయారు. తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ ఓటర్లు మాత్రం ఆశించిన మేర వారిని అక్కున చేర్చుకోలేదు. తిరస్కరించినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. మల్కాజ్ గిరి నుంచి పోటీ చేసిన పట్నం సునీతామహేందర్ రెడ్డి సైతం కారు దిగి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేశారు. ఆమె సైతం ప్రభావం చూపలేకపోయింది. అక్కడ బీజేపీ విజయం సాధించింది. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి సైతం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా పోటీ చేశారు. అయితే అక్కడ బీజేపీ విజయం సాధించింది. నాగర్ కర్నూల్ ఎంపీ రాములు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు భరత్‌కు ఎంపీ టికెట్ తెచ్చుకొని పోటీచేశారు. అక్కడ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు. సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేయగా ఓడిపోయారు. ఒక్క వరంగల్‌లో కారుదిగి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కడియం కావ్య మాత్రం సక్సెస్ అయింది. ఘన విజయం సాధించింది.

తెలంగాణలో బలపడ్డాం... తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి సహకరిస్తాం...ప్రధాని మోదీ



మిగతా.. 2లో



సీఎం పదవికి వైఎస్ జగన్ .. రాజీనామా

మిగతా.. 2లో

మిగతా..

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

# బీఆర్ఎస్ కు దెబ్బమీద దెబ్బ..ఇప్పటి వరకు ఉన్న కంటోన్మెంట్ కూడా కాంగ్రెస్ కైవసం



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేశ్ గెలుపొందారు. తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ కు చెందిన నివేదితపై 13 వేల ఓట్ల మెజార్టీ సాధించారు. 2023లో జరిగిన సాధరణ ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా లాస్య నందిత పోటీ చేసి గెలుపొందారు. ఫిబ్రవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందారు. దీంతో కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ కి బై ఎలక్షన్ అనివార్యం అయ్యింది. కాంగ్రెస్ నుంచి శ్రీ గణేష్, బీఆర్ఎస్ నుంచి దివంగత సాయన్న చిన్న కూతురు నివేదిత, బీజేపీ నుంచి వంశతిలక్ పోటీ పడ్డారు. శ్రీగణేశ్ గెలుపుతో అసెంబ్లీలో కాంగ్రెస్ కు ఒక సీటు పెరిగినట్లయింది.




## పులివెందులలో సీఎం జగన్ గెలుపు.. మెజారిటీ ఎంతంటే..?



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 4:** పులివెందులలో వైసీపీ అభ్యర్థి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గెలుపొందారు. సమీప ప్రత్యర్థి, టీడీపీ అభ్యర్థి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పై 61,687 ఓట్ల మెజారిటీతో జగన్ విజయం సాధించారు. భారత ఎన్నికల సంఘం తెలిపిన వివరాల ప్రకారం జగన్‌కు 1,16,315 ఓట్లు రాగా.. రవీంద్రనాథ్ రెడ్డికి 54,628 ఓట్లు పోలయ్యాయి. ఇక మూడో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి ధ్రువ్ కుమార్ రెడ్డి 10,083 ఓట్లు దక్కించుకున్నారు.

## కంచుకోట కుప్పంలో చంద్రబాబు ఘన విజయం




ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 4: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో ఘన విజయం సాధించారు. తన సమీప వైసీపీ ప్రత్యర్థి కేఆర్ జే భరత్ పై చంద్రబాబు 47,340 ఓట్ల తేడాతో గెలుపొందారు. మొత్తం 18 రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి చంద్రబాబుకు 1,20,926 ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థి భరత్ కు 73,585 ఓట్లు వచ్చాయి. టీడీపీ అధినేత చంద్రబాబుకు కుప్పం కంచుకోటగా ఉంది. ఆయన 1989 నుంచి ఇక్కడ పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఏడు పర్యాయాలు నెగ్గిన చంద్రబాబు... వరుసగా ఎనిమిదోసారి కూడా విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. గతంలో చంద్రగిరి నియోజకవర్గంలో ఓటమి తర్వాత చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి మారారు. అప్పటి నుంచి ప్రజలు ఆయనను ఆదరిస్తున్నారు.

## ఇయ్యాల ఢిల్లీకి చంద్రబాబు... ఎన్డీయే సమావేశానికి హాజరు!



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 4:** టీడీపీ అధినేత చంద్రబాబు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి విచ్చేశారు. మంగళవారం ఉదయం నుంచే కోలాహలంగా మారిన టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్... సాయంత్రం చంద్రబాబు రాకతో పసుపు జాతరను తలపించింది. టీడీపీ నేతలు, కార్యకర్తల నినాదాలతో ఎన్టీఆర్ భవన్ మార్మోగిపోయింది.కాగా, ఎన్డీయే భాగస్వామ్య పక్ష నేతగా ఉన్న చంద్రబాబు బుధవారం ఢిల్లీ వెళ్లే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే ఎన్డీయే సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారని తెలుస్తోంది.

## కరీంనగర్ నుంచి గెలిచిన అనంతరం బండి సంజయ్ ఏమన్నారంటే...!



**ఇయ్యాల్టి న్యూస్, కరీంనగర్, జూన్ 4:** అసెంబ్లీ ఎన్నికల్లోనే బీజేపీ గెలవాల్సిందని... కానీ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి ఓటేశారని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ నియోజకవర్గం నుంచి బండి సంజయ్ సమీప కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్ రావుపై 2.25 లక్షల భారీ మెజార్టీతో గెలిచారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ మూడో స్థానంలో నిలిచారు. కరీంనగర్ నుంచి గెలిచిన అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ... కరోనా సమయంలో కరీంనగర్ ప్రజల కోసం తాను పని చేశానని, పేద ప్రజల కోసం తాను పోరాడానని... అందుకే ప్రజలు తనను గెలిపించారన్నారు.


## ఏపీ ఎన్నికల ఫలితాలపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి...

## రియాక్షన్ ఏందంటే..!



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వచ్చాయి. ఏ పార్టీ గెలిచినా సాధారణ మెజారిటీ వస్తుందని అంతా భావించగా.. ఎగ్జిట్ పోల్స్ కు భిన్నంగా ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించింది. ఏపీ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్డీఏ కూటమికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లకు అభినందనలు తెలిపారు. ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడుతున్నందున.. తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటూ, అభివృద్ధి పథం వైపు సాగుదాం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## నల్గొండలో కాంగ్రెస్ సునామీ.. ఎంపీగా రఘువీర్ రెడ్డి రికార్డు మెజారిటీ..!



**ఇయ్యాల్టి న్యూస్, నల్లగొండ , జూన్ 4:** తెలుగు రాష్ట్రాల పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో నల్గొండ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి ప్రభంజనం సృష్టించారు. రాజకీయ దిగ్గజం కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి కొడుకుగా ఎన్నికల బరిలోకి దిగిన రఘువీర్ రెడ్డి అఖండ విజయాన్ని సాధించారు. బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిపై ఏకంగా 5.59 లక్షల మెజార్టీతో గెలుపు బావుటా ఎగరేసి.. రికార్డు సృష్టించారు. తెలంగాణ చరిత్రలో ఇదే అత్యధిక మెజార్టీ ఖావటం విశేషం.నల్లగొండ అంటే కాంగ్రెస్ కంచుకోటగా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో మరోసారి రుజువైంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కుందూరు రఘువీర్ రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా సైదిరెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి పోటీ పడ్డారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో రఘువీర్ రెడ్డి ఏకపక్షంగా దూసుకుపోయారు.

# మాధవీలతపై అసదుద్దీన్ ఘన విజయం..

### వరుసగా 5సార్లు గెలిచిన రికార్డు..



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూన్ 4: తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో పోరు హోరా హోరీగా సాగుతోంది. ముఖ్యంగా ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీకు, బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఇద్దరూ బరిలో నిలిచారు. అయితే ఇప్పటి వరకూ జరిగిన కౌంటింగ్లో రెండు సార్లు మాధవీలత అసదుద్దీన్ పై ఆధిక్యలోకి రావడం విశేషం. 12 రౌండు ముగిసే సమయానికి మాధవీలత కంటే అసదుద్దీన్ అధిక్యంలో కొనసాగారు. చివరి వరకు ఫలితం ఉత్కంఠగా సాగింది. ఒకానొక సమయంలో 33వేల ఓట్ల మెజార్టీతో అసదుద్దీన్ కు ఓట్లకు కాస్త దగ్గరగా వచ్చారు మాధవీలత. కానీ చివరి రౌండులో అసదుద్దీన్ విజయం సాధించారు.ఇక అసదుద్దీన్ రాజకీయ నేపథ్యం చూస్తే.. హైదరాబాద్ నియోజకవర్గంలో 1984 నుండి ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉన్నారు. అసదుద్దీన్ తండ్రి సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ వరుసగా 6 సార్లు ఈ స్థానంలో గెలుపొందారు. 1996లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు బీజేపీ తరపున పోటీ చేసి సలావుద్దీన్ చేతిలో 73 వేల ఓట్లతో ఓడిపోయారు. తండ్రి ప్రస్థానం ముగిశాక 2004, 2009, 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి వరుసగా నాలుగోసారి విజయం సాధించారు అసదుద్దీన్ ఓవైసీ. అయితే బీజేపీ నుంచి భగవంత రావు, బీఆర్ఎస్ నుంచి పుస్తే శ్రీకాంత్, కాంగ్రెస్ నుంచి ఫిరోజ్ ఖాన్ పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2024లో ఇదే హైదరాబాద్ నియోజకవర్గం నుంచి ఎంపీగా అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేశారు. అయితే ఎప్పుడూ లేనంత టఫ్ ఫైట్?ను ఎదుర్కొన్నారు. బీజేపీ తరఫున విరించి హాస్పిటల్ మాజీ ఛైర్మన్ మాధవి లత పోటీ చేశారు. చివరి వరకు హోరా హోరీగా సాగిన పోరులో మాధవీలతపై 2,97,031 ఓట్ల తేడాతో ఘనవిజయం సాధించారు. దీంతో వరుసగా ఐదు సార్లు ఇదే నియోజకవర్గం నుంచి విజయం సాధించిన నాయకుడిగా రికార్డు సృష్టించారు.

## తెలంగాణలో బలపడ్డాం...

### తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి సహకరిస్తాం...ప్రధాని మోదీ



**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , జూన్ 4:** కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ అధికారం చేపట్టబోతుందన్నారు ప్రధాని మోదీ. ఈ రోజు దేశంలో ప్రజాస్వామ్యం గెలిచిందన్న ప్రధాని మోది.... సబ్?కా సాత్? .. సబ్?కా వికాస్? మంత్రం గెలిచిందన్నారు. పార్టీకోసం పనిచేసిన కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పదేళ్లలో చేసిన అభివృద్ధిని కొనసాగిస్తామన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పాటుపడతామన్నారు.2024 ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించిన ఎన్నికల కమిషన్? కు కృతజ్ఞతలు తెలిపారు మోదీ. భారత ప్రజాస్వామ్యం దేశానికే ఆదర్శమన్నారు. ఇది విక్షిత్? భారత్?కు స్ఫూర్తి విజయమన్నారు. జమ్ముకశ్మీర్? ఓటర్లు కొత్త చరిత్ర సృష్టించారన్న మోదీ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య విక్టరీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ప్రతి రాష్ట్రంలోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కట్టారన్నారు. బీజేపీకి దేశ ప్రజలు అద్భుతమైన విజయాన్నిఅందిచారని... తెలంగాణలో బీజేపీ గెలిచిన స్థానాల సంఖ్య రెట్టింపు అయిందన్నారు. ఏపీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. జగన్నాథుడి ఆశీస్సులతో దేశంలో బీజేపీ గెలిచిందన్నారు.1992 తరువాత కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారం చేపట్టబోతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నేతృత్వంలో.. బీహార్? లో నితీష్? ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి విజయం సాధించిందన్నారు.అరుణాచల్? ప్రదేశ్?, సిక్కిం, ఒడిశాలో అద్భుతమైన విజయం సాధించామన్నారు. కేరళలో తొలిసారి బీజేపీ ఒక స్థానంలో గెలుపొందామన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్ ఘడ్ ఢిల్లీ , గుజరాత్ ఉత్తరాఖండ్, హిమాచల పదేశ్ రాష్ట్రాల్లో క్లీన్ స్వీప్? చేశామన్నారు.



## కాంగ్రెస్, బీజేపీలకు చెరో 8 సీట్లు..

(మొదటి పేజీ తరువాయి)

### తెలంగాణలో గెలిచిన అభ్యర్థులు వీరే

| క్రమ సంఖ్య | గెలిచిన అభ్యర్థి | పార్టీ | నియోజకవర్గం | మెజార్టీ |
|---|---|---|---|---|
| 1 | అసదుద్దీన్ ఓవైసీ | ఎంఐఎం | హైదరాబాద్ | 3.38 లక్షలు |
| 2 | కిషన్ రెడ్డి | బీజేపీ | సికింద్రాబాద్ | 49,944 వేలు |
| 3 | ఈటల రాజేందర్? | బీజేపీ | మల్కాజిగిరి | 3.87 లక్షలు |
| 4 | కొండా విశ్వేశ్వర్ రెడ్డి | బీజేపీ | చేవెళ్ల | 1.64 లక్షలు |
| 5 | డి.కె.అరుణ | బీజేపీ | మహబూబ్‌నగర్ | 4,500 |
| 6 | మల్లు రవి | కాంగ్రెస్ | నాగర్‌కర్నూల్ | 88 వేలు |
| 7 | రఘువీర్ రెడ్డి | కాంగ్రెస్ | నల్గొండ | 5.37 లక్షలు |
| 8 | కిరణ్ కుమార్ రెడ్డి | కాంగ్రెస్ | భువనగిరి | 1.95 లక్షలు |
| 9 | రఘునందన్ రావు | బీజేపీ | మెదక్ | 32 వేలు |
| 10 | సురేశ్? షెట్కార్ | కాంగ్రెస్ | జహీరాబాద్ | 45 వేలు |
| 11 | గోడం నగేశ్? | బీజేపీ | ఆదిలాబాద్ | 78 వేలు |
| 12 | ధర్మపురి అర్వింద్ | బీజేపీ | నిజామాబాద్ | 1.13 లక్షలు |
| 13 | బండి సంజయ్ | బీజేపీ | కరీంనగర్ | 2.12 లక్షలు |
| 14 | గడ్డం వంశీకృష్ణ | కాంగ్రెస్ | పెద్దపల్లి | 1.31 లక్షలు |
| 15 | కడియం కావ్య | కాంగ్రెస్ | వరంగల్ | 2.02 లక్షలు |
| 16 | బలరాం నాయక్ | కాంగ్రెస్ | మహబూబాబాద్ | 3.24 లక్షలు |
| 17 | రఘురాం రెడ్డి | కాంగ్రెస్ | ఖమ్మం | 4.62 లక్షల |

## ఏం జరిగిందో తెలియడం లేదు...

## కానీ...!: సీఎం జగన్




**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 4:** ఏపీలో అధికార వైసీపీ ఊహించని రీతిలో దారుణ పరాజయం పాలవడం పట్ల ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ స్పందించారు. మంగళవారం సాయంత్రం ఆయన తాడేపల్లి నుంచి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ మంచి చేసినా ఓటమిపాలయ్యామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వాలంటీర్, సచివాలయ వ్యవస్థలు తీసుకువచ్చాం... 1.05 కోట్ల మందికి సంక్షేమాన్ని అందించాం... పిల్లలు బాగుండాలని వారి అభ్యున్నతి కోసం అడుగులు వేశాం, విద్యా వ్యవస్థలో ఎన్నడూ చూడని మార్పులు తెచ్చాం... వితంతువులకు, వికలాంగులకు, అవ్వాతాతలకు పెన్షన్లు ఇచ్చాం... ఇచ్చిన ఏ మాట తప్పకుండా మంచి చేశాం... ఆ చేసిన మంచి ఏమైపోయిందో, ప్రజల ప్రేమ ఏమైపోయిందో అర్థంకావడంలేదని బాధను వెలిబుచ్చారు. సమయానికి రైతు భరోసా ఇచ్చాం... 54 లక్షల మంది రైతులకు అండగా నిలిచాం... మరి ఆ రైతన్నల ప్రేమ ఏమైందో తెలియదు అని ఆక్రోశించారు. పథకాలు అందుకున్న వారి ఆప్యాయత ఏమైందో తెలియదు అని వాపోయారు.”నా ప్రతి కష్టంలో కూడా తోడుగా, అండగా నిలబడిన ప్రతి ఒక్క నాయకుడికి, ప్రతి కార్యకర్తకు, ప్రతి వాలంటీరుకు, ప్రతి ఇంట్లోంచి వచ్చిన నా స్టార్ క్యాంపెయినర్ అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు...

## సీఎం పదవికి వైఎస్ జగన్ .. రాజీనామా



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ , జూన్ 4: ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురవడంతో వైఎస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఏపీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడంతో తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు. పరాభవంతో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఈసీ డిక్లరేషన్ అనంతరం గవర్నర్‌కు తన రాజీనామా లేఖను పంపారు.

### ఏపీ ఎన్నికల్లో నారా, నందమూరి ఫ్యామిలీ హవా..

## సత్తాచాటిన ఆ నలుగురు!



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 4:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఓడలు బండ్లయ్యాయి. బండ్లు ఓడలయ్యాయి. ఫలితాల్లో కూటమి భారీ మెజారిటీ సాధించింది. అధికారి పార్టీని చిత్తుగా ఓడించి అఖండ విజయం సొంతం చేసుకుంది. మరోవైపు లోక్‌సభ స్థానాల్లోనూ ఇదే హవా కొనసాగించింది. తెలుగు దేశం, జనసేన, బీజేపీ పార్టీలు కనీవినని రీతిలో అత్యధిక డిపాజిట్లు సొంతం చేసుకున్నారు. ఒక్క నారా, నందమూరి ఫ్యామిలీలోనే ఏకంగా నలుగురు విజయం సాధించారు.కుప్పంలో చంద్రబాబు, మంగళగిరిలో లోకేష్ గెలుపొందారు. అటు నందమూరి ఫ్యామిలీలో హిందూపురం నుంచి బాలకృష్ణ, విశాఖ ఎంపీగా భరత్ ఘన విజయం సాధించారు. చంద్రబాబు కుప్పంలో 1,18,623 ఓట్ల ఆధిక్యంతో ముందంజలో ఉన్నారు. నారా లోకేష్ మంగళగిరిలో 1,20,101 ఓట్లు, హిందూపురం నుంచి పోటీ చేసిన బాలకృష్ణకు 1,07,250 ఓట్లు దక్కాయి. ఇక విశాఖ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసిన భరత్ కూడా అధిక మెజార్టీతో ముందంజలో కొనసాగుతున్నారు.దాదాపు కూటమి గెలుపు ఖాయం అవడంతో తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకుంటున్నారు. చంద్రబాబు కుటుంబ సభ్యులతో కేక్ కట్ చేసుకుని సెలబ్రేట్ చేసుకున్నారు. మొత్తం 175 అసెంబ్లీ స్థానాకలు గానూ అధికార వైసీపీ కేవలం 13 స్థానాలకే సరిపెట్టుకోగా కూటమి 162 స్థానాల్లో గెలుపు బావుటా ఎగరవేసింది.

## కూటమి ప్రభంజనం.. చంద్రబాబు ఇంట్లో గెలుపు సంబరాలు.. ఫోటోలు వైరల్..



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 4: ఏపీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో చంద్రబాబు ఇంట్లో గెలుపు సంబరాలు చేసుకున్నారు. కుటుంబసభ్యులంతా కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ చేసుకున్నారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

## కౌంటింగ్ ట్రెండ్ దెబ్బ.. స్టాక్ మార్కెట్లు ఢమాల్

ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, జూన్ 4: లోక్ సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ కు, వాస్తవ ఫలితాలకు భారీ తేడా కనిపించిన నేపథ్యంలో, భారత స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులతో దాదాపు కుప్పకూలాయి. సెన్సెక్స్ ఒక్కరోజే 4 వేల పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ నాలుగేళ్లలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో నష్టాలు చవిచూసింది. మంగళవారం ఉదయం 8 గంటలకు దేశవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా, బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ ట్రేడింగ్ ల్లో వేచిచూసే ధోరణి కనిపించింది. కానీ ఫలితాలు వెల్లడయ్యే కొద్దీ మార్కెట్లు తీవ్ర ఒత్తిళ్లకు లోనయ్యాయి. ముగింపు సమయానికి సెన్సెక్స్ 4,390 పాయింట్ల నష్టంతో 72,079.05 వద్ద క్లోజయింది. నిఫ్టీ 1,379 పాయింట్ల నష్టంతో 21,884.50 వద్ద ముగిసింది. ఇవాళ ఎన్డీయే కూటమి 400 మార్కుకు దరిదాపుల్లో ఉన్నా స్టాక్ మార్కెట్ల పరిస్థితి మరోలా ఉండేది. కానీ, ఫలితాలు భిన్నంగా ఉండడంతో మార్కెట్ సూచీలు అతలాకుతలం అయ్యాయి.






## గాంధీనగర్ నుంచి అమిత్ షా ఘన విజయం

### దాదాపు 4 లక్షల భారీ మెజారిటీతో గెలుపొందిన కేంద్ర మంత్రి

### 5 లక్షల పైచిలుకు ఓట్లు సాధించిన షా


### ఎన్డీఏ కూటమి ఖాతాలో మొదటి సీటు




ఇయ్యాల్టి న్యూస్, గుజరాత్, జూన్ 4: కేంద్ర హోంమంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా ఘన విజయం సాధించారు. ఎన్డీఏ కూటమికి తొలి విజయాన్ని కట్టబెట్టారు. గుజరాత్ లోని గాంధీనగర్ నుంచి పోటీ చేసిన అమిత్ షా.. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి సోనాల్ రమణ్ భాయి పటేల్ మీద 4.10 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. అమిత్ షాకు మొత్తంగా 5.26 లక్షల ఓట్లు పోలవగా.. ఆయన ప్రత్యర్థి రమణ్ భాయి పటేల్ కు 1.15 లక్షల ఓట్లు దక్కాయి.

## లోక్‌సభ ఫలితాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తొలి స్పందన ఇదే

### ఈ ఫలితాలు నరేంద్ర మోదీకి నైతికి ఓటమి అన్న కాంగ్రెస్ చీఫ్



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4: లోక్‌సభ ఎన్నికలు-2024 ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. ఈ ఫలితాలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నైతిక ఓటమి అని వ్యాఖ్యానించారు. మోదీకి వ్యతిరేకంగా స్పష్టమైన తీర్పు వచ్చిందని అన్నారు. బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ రాకపోవడం మోదీకి నైతిక, రాజకీయ ఓటమి అని ఖర్గే అభిప్రాయపడ్డారు. ఈ ఫలితాలు ప్రజాతీర్పు అని, మోదీ వ్యతిరేక ఆదేశమని ఖర్గే అన్నారు. బీజేపీకి సంపూర్ణ మెజారిటీ రాలేదని పేర్కొన్నారు. లోక్‌సభ ఫలితాల నేపథ్యంలో పార్టీ సీనియర్లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, జైరామ్ రమేశ్‌లతో కలిసి ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. కాగా ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో బుధవారం కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. భాగస్వామ్య పార్టీలను సంప్రదించకుండా తాము ఎలాంటి ప్రకటనా చేయబోమని, కూటమి సమావేశంలో చరిస్తామని ఆయన పేర్కొన్నారు.


## వారణాసిలో ప్రధాని మోదీ హ్యాట్రిక్- మెజార్టీ ఎంతంటే?



ఇయ్యాల్టి న్యూస్, వారణాసి, జూన్ 4: లోక్?సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ విజయ ఢంకా మోగించారు. ఉత్తర్?ప్రదేశ్?లోని వారణాసిలో హ్యాట్రిక్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి అజయ్? రాయ్?పై 1,52,513 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అయితే, మోదీపై అజయ్? రాయ్ పోటీ చేయడం వరుసగా మూడోసారి. 2014లో ప్రధాని తొలిసారి ఇక్కడ పోటీ చేయగా, 56 శాతం ఓట్లతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అజయ్ రాయ్‌కు కేవలం 75వేల ఓట్లు దక్కాయి. ఆమ్ ఆద్మీ తరఫున అరవింద్ కేజ్రీవాల్ రెండో స్థానంలో నిలిచారు. ఇక, 2019 ఎన్నికల్లో ప్రధానికి 63 శాతం ఓట్లు రాగా, అజయ్‌రాయ్‌కి 14శాతం ఓట్లు దక్కాయి.

## లోక్‌సభ ఎన్నికల్లో సరికొత్త రికార్డ్..

### 10లక్షల మెజార్టీతో ఇందౌర్ అభ్యర్థి గ్రాండ్ విక్టరీ



ఇయ్యాల్టి న్యూస్, మధ్యప్రదేశ్, జూన్ 4: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేత శంకర్ లల్వానీ సరికొత్త చరిత్ర సృష్టించారు. మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ స్థానం నుంచి ఆయన ఏకంగా 10,08,077 ఓట్ల అఖండ మెజార్టీతో విజయం సాధించారు. ఈ స్థానం నుంచి మొదట పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ వెనక్కి తీసుకున్నారు. లోక్‌సభ చరిత్రలో ఇప్పటివరకు బీజేపీ నాయకురాలు ప్రీతమ్ ముండే పేరుతో అత్యధిక మెజార్టీ రికార్డు (6.9లక్షలు) ఉండగా శంకర్ లల్వానీ దాన్ని అధిగమించారు. ఇక ఈ నియోజకవర్గం నుంచి రెండో స్థానంలో నోటా ఉంది. దాదాపు 2.18 లక్షల ఓట్లు వచ్చాయి. దీంతో ఇందౌర్? నోటాకు అత్యధికంగా ఓట్లు పడిన స్థానంగా రికార్డుకెక్కింది.

# బీజేడీ ప్రభుత్వానికి బీజేపీ చెక్.. భారీ విజయం

## ఒడిశాలో ముగిసిన నవీన్ పట్నాయక్ శకం..



ఇయ్యాల్టి న్యూస్, ఒడిశా , జూన్ 4: ఒడిశాలో నవీన్ పట్నాయక్ శకం ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బిజూ జనతాదళ్ ఓటమి పాలయ్యింది. ఒడిశాలో తొలసారి కాషాయం జెండా రెపరెపలాడింది. బీజేపీకి అక్కడ 81 సీట్లు లభించాయి. బీజేడీకి కేవలం 47 సీట్లు మాత్రమే లభించాయి. కాంగ్రెస్ 15, ఇతరులు 4 లీడ్ లో ఉన్నారు. లోక్ సభ ఎన్నికల్లో కూడా బీజేడీ సత్తా చాటలేకపోయింది.. 21 లోక్‌సభ స్థానాల్లో 1 దానిలో మాత్రమే లీడ్ లో ఉంది.. 19 సీట్లలో బీజేపీ ఆధిక్యంలో ఉండగా.. 1 దానిలో కాంగ్రెస్ ఆధిక్యంలో ఉంది.. ఒడిశాకు 2000 నుంచి 2024 వరకు ఐదుసార్లు సీఎంగా సేవలందించారు నవీన్ పట్నాయక్ . వయోభారం మీద పడినప్పటికి గతంలో ఎన్నడు లేని విధంగా పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. అయినప్పటికి ఆయన పార్టీ ఓడిపోయింది. ముఖ్యంగా బీజేడీ పగ్గాలను మాజీ ఐఏఎస్ అధికారి పాండ్యన్ చేపడుతారని బీజేపీ చేసిన ప్రచారం బాగా పనిచేసింది. భూమి పుత్రుడికే ఒడిశా సీఎం పగ్గాలు అప్పగిస్తామని ప్రధాని మోదీ, అమిత్ షా పదేపదే ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించారు.

## చంద్రబాబు, నితీష్‌తో, ఇంకెవరితోనూ మాట్లాడలేదు.. క్లారిటీ ఇచ్చిన శరద్ పవార్!



ఇయ్యాల్టి న్యూస్, మహారాష్ట్ర, జూన్ 4: లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఎన్సీపీ అధినేత శరద్ చంద్ర పవార్ తొలిసారిగా స్పందించారు. శరద్ పవార్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి తన వైఖరిని వెల్లడించారు. మహారాష్ట్ర, దేశంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై శరద్ పవార్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా తీర్పు సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఇవాళ సాయంత్రం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎన్సీపీ సీనియర్ నేతలు, ఇతర ప్రముఖ నేతలతో కలిసి భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో సామరస్యంగా నిర్ణయం తీసుకుంటామన్నారు.ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ నాయకత్వంలో మహారాష్ట్రలోని 10 స్థానాలకు 7 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నామన్నారు శరద్ పవార్. ఈ విజయం కేవలం ఎన్సీపీ విజయమే కాదన్న ఆయన, కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, సహచరులందరూ కష్టపడి పనిచేశారని అభినందించారు. ఇది ప్రతి ఒక్కరి విజయం అన్నారు. మహారాష్ట్ర ప్రజలకు సేవ చేసేందుకు జాగ్రత్తలు తీసుకుంటామన్న పవార్.. అలాగే ఇండియా కూటమిలో చేరాలంటూ చంద్రబాబుతో గానీ, ఇంకెవరితోనైనా మాట్లాడానన్న వార్తలు అవాస్తవం అన్నారు. అలాంటి చర్చలు జాతీయ స్థాయిలో జరుగుతాయి" అని శరద్ పవార్ క్లారిటీ ఇచ్చారు.

## ట్రక్ చక్రాల కింద ఇరుక్కున్న చిన్న కుక్క.. సాయం చేసిన మరో కుక్క



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4: భూమిపై అనేక రకాల జంతువులు కనిపించినప్పటికీ.. మానవులతో చాలా బాగా కలిసిపోయే కొన్ని జంతువులు ఉన్నాయి. ఈ జంతువుల్లో కుక్కల పేరు అగ్రస్థానంలో ఉంటుంది. శతాబ్దాలుగా కుక్కలు మానవులకు స్నేహితులుగా పరిగణించబడుతున్నాయి. శునకాల్లో కూడా ఎంతో మానవత్వం కనిపిస్తుంది. పెంపుడు కుక్కలు తమ యజమాని కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టిన సంఘటనలు గురించి అనేకం విన్నాం.. చాలా సార్లు చూశాం కూడా. ఇది మాత్రమే కాదు.. ఏదైనా కుక్క ఎప్పుడైనా ఆపదలో ఉంటే.. మరొక కుక్క ఖచ్చితంగా తమ తోటి కుక్కకు సహాయం చేస్తుంది. ప్రస్తుతం అలాంటి వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో ఒక కుక్క చిన్న కుక్కకు సహాయం చేస్తుంది.అసలే చిన్న కుక్క ప్రాణం ప్రమాదంలో పడింది. ట్రక్కు చక్రాల మధ్య ఇరుక్కుపోయింది. ట్రక్ కదిలి ఉంటే చిన్న కుక్క ఖచ్చితంగా ప్రాణాలు కోల్పోయేది. ఇది చూసిన మరో కుక్క వెంటనే తన తోటి కుక్క ప్రాణాలను కాపాడడానికి పరిగెత్తింది. ట్రక్ డ్రైవర్‌ను చిన్న కుక్క ఇరుక్కున్న ప్రదేశానికి లాక్కుని తీసుకుని వెళ్ళింది. ఆపై డ్రైవర్ చిన్న కుక్కకి సహాయం చేశాడు. చిన్న కుక్క మెడలోని తాడు లారీ చక్రాలకు చిక్కుకున్నట్లు వీడియోలో చూడవచ్చు. కుక్క కష్టాల్లో ఉన్నవిషయం చూసి.. మరో కుక్క.. చిన్న కుక్క వద్దకు వెళ్లి సహాయం చేయడానికి ప్రయత్నిస్తుంది. అయితే తనంతట తాను ఆ కుక్కకు సహాయం చేయలేనని గుర్తించి అప్పుడు ట్రక్ డ్రైవర్ సహాయం తీసుకుంది. ఈ విధంగా చిన్న కుక్క ప్రాణం కాపాడింది.

## మండిలో కంగనా రనౌత్ విజయం

### తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్‌పై 72,088 ఓట్ల మెజార్టీతో విజయం

ఇయ్యాల్టి న్యూస్, హిమాచల్ ప్రదేశ్, జూన్ 4: బాలీవుడ్ నటి కంగనా రనౌత్ రాజకీయ అరంగేట్రంలోనే జయకేతనం ఎగురవేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి స్థానంలో బీజేపీ తరపున పోటీ చేసిన కంగన తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్‌పై 72,088 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఏడో దశ ఎన్నికల్లో భాగంగా ఈ స్థానానికి జూన్ 1న పోలింగ్ జరిగింది. ఇక విలేకరుల సమావేశంలో రనౌత్ మాట్లాడుతూ.. “మేము ఈ ఎన్నికల్లో నరేంద్ర మోదీ పేరు మీద పోరాడాము. ఆయన విశ్వసనీయత, ఆయన హామీ, ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసం ఫలితంగానే మేము మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాం” అని అన్నారు. మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి అనురాగ్ ఠాకూర్ కూడా విజయం సాధించారు.






## పోటీ చేసిన రెండుచోట్లా గెలిచిన రాహుల్ గాంధీ

### వయనాడ్‌లో సీపీఐ అభ్యర్థిపై 3.5 లక్షల మెజార్టీతో విజయం

### రాయ్‌బరేలీ నుంచి 3.7 లక్షల మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ నేత

ఇయ్యాల్టి న్యూస్, కేరళ, జూన్ 4: కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తాను పోటీ చేసిన రెండు స్థానాలలో విజయం సాధించారు. కేరళలోని వయనాడ్ నుంచి రెండోసారి గెలిచారు. సమీప సీపీఐ అభ్యర్థి యానీ రాజాపై 3.5 లక్షల మెజార్టీతో గెలుపొందారు. ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి 3.7 లక్షల మెజార్టీతో గెలిచారు. ఇక కర్ణాటకలోని హసన్ నుంచి ఎన్డీయే కూటమి అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ ఓడిపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయాస్ ఎం అయ్యర్ చేతిలో 43వేల మెజార్టీతో ఓడిపోయారు. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి బీజేపీ అభ్యర్థి అన్నామలై రెండో స్థానంలో కొనసాగుతున్నారు. తిరువనంతపురంలో కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి శశిథరూర్ విజయం సాధించారు. ఇక్కడి నుంచి శశిథరూర్ వరుసగా నాలుగోసారి గెలిచారు.

RRR
ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

# చంద్రబాబు, పవన్, లోకేశ్ కంగ్రాట్స్: రామ్ గోపాల్ వర్మ

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4: ఏపీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలను చూసి వివాదస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ప్లేటు ఫిరాయించారు. ఎన్నికల్లో గ్రాండ్ విక్టరీ దిశగా దూసుకెళ్తున్న కూటమిని ప్రశంసించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన జనసేన చీఫ్ పవన్ కల్యాణ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నారా లోకేశ్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడులకు అభినందనలు తెలుపుతూ ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. కాగా, అప్పటివరకూ విమర్శలు గుప్పించిన ఆర్‌జీవీ ఇలా మారిపోవడంపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. ఇక టీడీపీ, జనసేనలను విమర్శిస్తూ గతంలో రామ్ గోపాల్ వర్మ ఎక్స్ (ట్విట్టర్) వేదిగా తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. అలాగే చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను పోలిన పాత్రలతో కొన్ని సినిమాలు కూడా తీశారాయన.



కంగ్రాట్స్.. చంద్రబాబు, పవన్, లోకేశ్

**చూసి ముర్వాలే**



## వామ్మో మంచు లక్ష్మి .. కాలు ఎంత ఎత్తు లేపిందేంది...

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4: మంచు లక్ష్మి ఏమి చేసినా అది కచ్చితంగా వైరల్ అవుతుంది. తాజాగ చేసిన ఫోటోషూట్ కూడా అదే రేంజ్?లో వైరల్ అవుతోంది. ఎందుకంటే..







## నగరి ఓటమి ఎఫెక్ట్: జబర్దస్త్ జడ్జీగా రోజా రీఎంట్రీ.. అదే దిక్కు అంటూ దారుణంగా ట్రోలింగ్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4: జబర్దస్త్ కు రోజా రీఎంట్రీ ఇస్తుందా.. ? అంటే నిజమే అన్న వార్తలు వినిపిస్తున్నాయి. జబర్దస్త్ మొదలైనప్పటినుంచి ఆమె జడ్జిగా వ్యవహరిస్తూ వస్తుంది. నాగబాబు, రోజా నే మొదట జబర్దస్త్ జడ్జిలుగా ఎంట్రీ ఇచ్చారు. దాదాపు ఐదేళ్లకు పైగా వీరిద్దరూ ఆ కామెడీ సామ్రాజ్యన్ని కింగ్ అండ్ క్వీన్ గా ఏలారు. నాగబాబు షో నుంచి బయటకు వచ్చాడో .. కొద్దికొద్దిగా జబర్దస్త్ రూపురేఖలు మారుతూ వచ్చాయి. ఇక ఎలాగోలా రోజా జబర్దస్త్ బరువును భుజాన వేసుకొని తిరిగింది. అయితే గత ఎన్నికల్లో ఆమె మంత్రిగా మారాక పూర్తిగా జబర్దస్త్ కు రోజా బ్రేక్ ఇచ్చింది. అలావెళ్లిన రోజమ్మ మళ్లీ జబర్దస్త్ కు రీ ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమయ్యింది అని టాక్ నడుస్తోంది. ఏపీఎన్నికలు ఫలితాల్లో రోజా ఓడిపోయింది. నగరిలో ఆమె డిపాజిట్లు కూడా కోల్పోయింది. ఇక రోజాకు రాజకీయ మనుగడ లేదు.. ఆమెకు వేరే అప్షన్ కూడా లేదు. అందుకే జబర్దస్త్ నే మళ్లీ నమ్ముకుంటుంది. ఇంకా చెప్పాలంటే వేరే దిక్కు లేదని అభిమానులు చెప్పుకొస్తున్నారు.




## పవన్ గెలుపుపై మెగాస్టార్ ట్వీట్.. డియర్ కళ్యాణ్ అంటూ ఎమోషనల్ గా..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4: ఏపీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. పదేళ్ల నిరీక్షణ తర్వాత పవన్ కళ్యాణ్ మొదటిసారి భారీ విజయం సాధించారు. జనసేన కూడా పోటీ చేసిన అన్ని నియోజకవర్గాల్లో దూసుకుపోతుంది. దీంతో సినీ పరిశ్రమ నుంచి పవన్ కళ్యాణ్ కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జనసేన, పవన్ కళ్యాణ్ గెలవడంతో పవన్ కు కంగ్రాట్స్ చెప్తూ పలువురు హీరోలు, డైరెక్టర్స్, నిర్మాణ సంస్థలు, సినీ ప్రముఖులు ట్వీట్స్ చేస్తున్నారు. తాజాగా పవన్ అన్నయ్య, మెగాస్టార్ చిరంజీవి ట్విట్టర్లో తమ్ముడి గెలుపుని ఉద్దేశిస్తూ ఎమోషనల్ ట్వీట్ చేశారు. చిరంజీవి తన ట్వీట్ లో.. డియర్ కళ్యాణ్ బాబు.. ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను, తగ్గావని ఎవరు అనుకున్నా అది ప్రజలని నెగ్గించటానికే అని నిరూపించిన నిన్ను చూస్తుంటే ఒక అన్నగా గర్వంగా వుంది. నువ్వు గేమ్ ఛేంజర్‌వి మాత్రమే కాదు, మ్యాన్ అఫ్ ది మ్యాచ్ వి కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది. నీ కృషి, నీ త్యాగం, నీ ధ్యేయం, నీ సత్యం జనం కోసమే. ఈ అద్భుతమైన ప్రజా తీర్పు, రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల సంక్షేమం కోసం, అలాగే నీ కలల్ని, నువ్వు ఏర్పరుచుకున్న లక్ష్యాల్ని నిజం చేసే దిశలో నిన్ను నడిపిస్తాయని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదిస్తూ, శుభాభినందనలు. నువ్వు ప్రారంభించే ఈ కొత్త అధ్యాయంలో నీకు శుభం కలగాలని, విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను అంటూ ఎమోషనల్ ట్వీట్ చేశారు.

## నైట్ ఫోటోలు షేర్.. తడిసిన అందాలతో చాలా హాట్‌గా రాశి ఖన్నా




ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4: హీరోయిన్ రాశి ఖన్నా తన లేటెస్ట్ ఫోటోలను ఇన్‌స్టాలో షేర్ చేసింది. డీప్ నెక్ డ్రెస్‌లో ఫోటోలకు హాట్ ఫోజులిచ్చింది.



## అందం ఆరబోస్తూ ఇనయా.. పోలింగ్ రిజల్ట్స్ నుంచి రిలీఫ్ కావాలంటే ఈ ఫొటోలు చూడాల్సిందే!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4: బిగ్ బాస్ బ్యూటీ.. ఇనయా సుల్తానా మరోసారి తన గ్లామర్ పిక్స్‌తో ఆకట్టుకుంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫొటోలు చూసి కుర్రాళ్లు ఫిదా అవుతున్నారు.



## ప్రగ్య కాళ్ళు చూశారా? ఎంత పొడుగ్గా ఉన్నాయో!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4: బాలీవుడ్ ఇండస్ట్రీలో దీపికా పదుకోన్, అనుష్కా శర్మ వంటి హీరోయిన్లను పొడుగుకాళ్ల సుందరి అంటుంటారు. టాలీవుడ్ కు వస్తే ప్రగ్యాను ఆ ట్యాగ్ ఇవ్వొచ్చు. కావాలంటే ఈ ఫోటోలు చూడండి.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838